క్లుప్తంగా

వైద్యశాలకు వీల్‌చైర్ల బహూకరణ



వైద్యశాలకు వీల్‌చైర్లు అందజేస్తున్న దప్పిలి బ్రహ్మనందరెడ్డి

గిద్దలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు పట్టణానికి చెందిన సూర్య విద్యానికేతన్ అధినేత దప్పిలి బ్రహ్మనందరెడ్డి తన తండ్రి దప్పిలి ఈశ్వర్‌రెడ్డి జ్ఞాపకార్థం రెండు వీల్‌చైర్లను ఆర్‌ఎంవో డాక్టర్ కడప రమణారెడ్డికి గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా దప్పిలి బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లోనూ పేదలు, రోగులకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. దాతను ఆర్‌ఎంఓ రమణారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

31 మద్యం బాటిళ్లు పట్టివేత



బేస్తవారిపేట: మండలంలోని బార్లకుంటలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి గురువారం తెలిపారు. నిందితుడి నుంచి 31 క్వార్టర్ల మద్యం స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కన్నీళ్లు.. కామెర్లు!

- తర్లుపాడు మండలం లక్ష్మక్కపల్లిలో జలఘోష
- పైప్‌లైన్ లీకేజీలతో రెండు నెలలుగా సాగర్ నీరు బంద్
- పొలాల్లోని బోర్ల నీరు తాగి ఎస్సీ కాలనీలో 20 మంది చిన్నారులకు కామెర్లు
- కలెక్టర్ జోక్యం చేసుకోవాలని గ్రామస్తుల విన్నపం




మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో సేకరించిన నీటి నమూనాలు

తర్లుపాడు:

ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశాల్లో టేబుళ్లపై ఐఎస్‌ఓ సర్టిఫైడ్ మినరల్ వాటర్ బాటిళ్లు ఉండాలి. లేదంటే వారి ఆవేశానికి చిరుద్యోగులు బలైపోతారు. ప్రజలు కూడా తమ లాంటి మనుషులేనని, వారికి కూడా సురక్షిత మంచినీరు అందించాలన్న విషయాన్ని తర్లుపాడు మండలంలోని ప్రజాప్రజాప్రతినిధులు, అధికారులు విస్మరించినట్టున్నారు. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మక్కపల్లి గ్రామానికి రెండు నెలల క్రితం సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. లక్ష్మీపురంలోని పంప్ హౌస్ నుంచి గ్రామానికి నీరు సరఫరా చేసే పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడటమే అందుకు కారణం. పైప్‌లైన్‌కు వేగంగా మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాత్సారం చేయడంతో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా సుమారు 100 కుటుంబాలు నివాసం ఉంటున్న గ్రామ ఎస్సీ కాలనీ వాసులు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు.

20 మంది పసివాళ్లకు పసికర్లు

సాగర్ నీటి సరఫరా నిలిచిపోవడం, ఎస్సీ కాలనీలో ఓ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో కాలనీ వాసులకు వ్యవసాయ బోర్ల నీరే దిక్కయింది. ఆ నీటిని తాగిన కుటుంబాల్లో సుమారు 20 మంది చిన్నారులు కామెర్ల వ్యాధి బారిన పడ్డారు. ఫ్లోరైడ్‌తో కూడిన బోర్ల నీరు తాగేందుకు పనికిరానప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో వాటినే వినియోగిస్తున్నారు. కాలనీలో చిన్నారులు అనారోగ్యానికి గురయ్యారని తెలుసుకున్న తర్లుపాడు పీహెచ్‌సీ డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. నీటిని పరీక్షించి తాగేందుకు వినియోగించవద్దని కాలనీ వాసులకు సూచించారు. సాగర్ నీటి సరఫరాను పునరుద్ధరించేలా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఓవర్‌హెడ్ ట్యాంకు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



కలుజువ్వలపాడు పంచాయతీ పరిధిలోని కొండారెడ్డిపల్లిలో గత రెండు నెలలకు పైగా మంచినీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ బోర్ల నీటిలో చిలుము వస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి సాగర్ నీటిని సరఫరా చేయాలని కోరినా పట్టించుకోవడం లేదు. చిన్నారులు కామెర్లు సోకి అనారోగ్యానికి గురయ్యారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నాం.

– శిఖామణి, సర్పంచ్

వారంలోగా నీరిస్తాం

నేను విధుల్లో చేరి 20 రోజులవుతోంది. కలుజువ్వలపాడు పంప్‌హౌస్ నుంచి లక్ష్మక్కపల్లి మధ్య సాగర్ పైప్‌లైన్‌కు 14 చోట్ల లీకేజీలు ఏర్పడగా మరమ్మతులు చేశాం. లక్ష్మీపురంలోని పంప్‌హౌస్‌లో మోటార్ మరమ్మతులకు గురైంది. వారం రోజుల్లోగా మోటార్ బిగించి తాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ప్రతాప్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి



కంభంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కంభం: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రజలపై వేస్తున్న పన్నుల భారాన్ని తగ్గించాలని సీపీఎం నాయకులు ఖాజావలి, అన్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పిలుపు మేరకు గురువారం కంభం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ కిరణ్‌కు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించి మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించి, మెడికల్ కాలేజిని త్వరితగతిన పూర్తిచేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇసుక ఉచితంగా అందుబాటులో లేకపోవడంతో వేలాది మంది కార్మికులు ఉపాధి లేక అల్లాడుతున్నారని చెప్పారు. ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీల పెంపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని కోరారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గొట్లగట్టు విద్యార్థి



నరహరితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించనున్న జాతీయ కబడ్డీ పోటీలకుబ గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పెండెం నరహరి ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ వై.బాలగురవయ్య తెలిపారు. ఇటీవల బాపట్ల జిల్లా పిట్లవారిపాలెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రకాశం జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ కనబరచటంతో జాతీయ పోటీలకు రెండోసారి ఎంపికై నట్లు వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాలని హెచ్‌ఎం, పీడీ, పీఎంసీ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి కృషి

- సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య



నూతన కమిటీని సన్మానిస్తున్న వీఆర్‌ఏలు

మార్కాపురం రూరల్: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య చెప్పారు. గురువారం మార్కాపురం డివిజన్ వీఆర్‌ఎల సంఘ నూతన కమిటీ ఏర్పాటు కోసం వచ్చిన ఆయన మాట్లాడుతూ.. సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష్య, ఉపాధ్యక్షులుగా ఎం.బ్రహ్మయ్య, కాశీరాంనాయక్, ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రావూరి మోజెస్, కోశాధికారిగా రంగారావుతోపాటు కమిటీ సభ్యులుగా నారాయణమ్మ, రాజేష్, జాయ్‌సన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ చెన్నయ్య పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ త్రివినాగ్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. నూతన కమిటీని సన్మానించారు.



మార్కాపురంలో మాట్లాడుతున్న డీవైఈఓ శామ్యూల్



కొనకనమిట్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్



కంభం : మాట్లాడుతున్న ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ



మల్లవరంలో నెహ్రూ చిత్రపటానికి డీఎల్‌డీఓ

ఉన్నత విద్యతో ఉజ్వల భవిత

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని గురువారం మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలగడం అలవాటు చేసుకోవాలని, కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని పాఠశాలల యాజమాన్యాలు, వక్తలు సూచించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ నాయకుల వేషధారణతో అలరించారు.



మార్కాపురం : అరబిందో స్కూల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన



మార్కాపురం వాసవీనికేతన్‌లో జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారులు

- బాల్యం ఎంతో అమూల్యమైనది
- చిన్నారులకు విద్యావేత్తలు, అధికారుల దిశానిర్దేశం
- ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో ఘనంగా బాలల దినోత్సవం

మార్కాపురం టౌన్: బాల్యం ఎంతో అమూల్యమైనదని, విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలని మార్కాపురం ఉప విద్యాశాఖాధికారి శామ్యూల్ జాన్ దిశానిర్దేశం చేశారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎం.చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. డీవైఈఓ మాట్లాడుతూ.. బాల్యం అనే పునాదిపైనే మన జీవితం ఆధారపడి ఉంటుందని, ప్రతి విద్యార్థి లక్ష్యం నిర్దేశించుకుని చదవాలని చెప్పారు. తన జీవితంలో ఎదుర్కొన్న కష్టనష్టాలను తహసీల్దార్ చిరంజీవి వివరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఏ1 గ్లోబల్ కళాశాల చైర్మన్ మీర్జా షంషేర్ అలీబేగ్ సహకారంతో బహుమతులు అందజేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు విజేత టీఎస్ జగన్నాథ్, ఏ1 గ్లోబల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అరవింద స్కూల్లో కరస్పాండెంట్ సి.వాణీ రాధకృష్ణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. శ్రీసాయి చైతన్య హైస్కూల్లో విద్యార్థులకు సెక్రటరీ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ నెహ్రూ జీవితం గురించి వివరించారు.

విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలి

మార్కాపురం: జవహర్‌లాల్ నెహ్రూను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలని ఏ1 గ్లోబల్ కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ సూచించారు. గురువారం చిల్డ్రన్స్‌డే సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డైరెక్టర్ మీర్జా మసూద్ ఆలీబేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డీన్ శివకుమార్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

✦ కమలా గ్రూప్ విద్యాసంస్థల్లో చైర్మన్ పి.పవన్ కుమార్, అకడమిక్ డైరెక్టర్ సింధూజ ఆధ్వర్యంలో ప్రిన్సిపాళ్లు ఎంపీ పుల్లయ్య, డాక్టర్ స్వరూప్ రంజన్ తదితరులు బాలల హక్కుల గురించి వివరించారు.

✦ స్ఫూర్తి మానసిక దివ్యాంగుల పాఠశాలలో 1986–87 జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాషా, గుంటక సుబ్బారెడ్డి, అన్నా రాము, టి.వెంకటరమణ, బీజేపీ నేత కృష్ణారావు, ఎమ్‌ఆర్‌కే బాషా, తడికమళ్ల శ్రీను పాల్గొన్నారు.

✦ వాసవీ విద్యానికేతన్‌లో డైరెక్టర్ కె.రంగయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆహూతులను అలరించారు.

✦ సాయిబాలాజీ పాఠశాలలో డైరెక్టర్ పి.ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఎంపీడీఓ బి.శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

✦ ఓంసాయివికాస్ విద్యా సంస్థలో డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధారాణి, ఇన్‌చార్జి ఉమా తదితరులు పాల్గొన్నారు.

విద్యతో బంగారు భవిత

పొదిలి రూరల్: చదువుతో బంగారు భవిష్యత్‌కు బాటలు ఏర్పరుచుకోవాలని కనిగిరి డీఎల్‌డీఓ కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం పొదిలి మండలంలోని మల్లవరం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలలు హక్కులు, రక్షణ చట్టాల గురించి వివరించారు. తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ జి.శోభన్‌బాబు, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ ప్రగతికి తోడ్పడాలి

కొనకనమిట్ల: కొనకనమిట్ల జెడ్పీ పాఠశాలలో నెహ్రూ చిత్ర పటానికి తహసీల్దార్ ఆవుల సురేష్ నివాళులర్పించారు. గొట్లగట్టు కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, మర్రిపాలెం జెడ్పీ పాఠశాలలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, హెచ్‌ఎంలు విజయలక్ష్మి, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

తర్లుపాడు: స్థానిక జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి నృత్య ప్రదర్శన నిర్వహించారు. లింగారెడ్డి కాలనీలో విద్యార్థులకు జాతీయోద్యమంలో నెహ్రూ పాత్రను హెచ్‌ఎం మౌలాలి వివరించారు. లక్ష్మక్కపల్లి ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం జగన్‌బాబు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

పొదిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్ర పటానికి మానవత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నివాళులర్పించారు. సంస్థ ప్రతినిధులు కె.యల్లమందారెడ్డి, బండి అశోక్, శ్రావణి వెంకటేశ్వర్లు, తానికొండ వెంకటరావు, కిరణ్మయి, డాక్టర్ మణి, జి.శ్రీనివాసులు, బాజీ కరీముల్లా, మేడా నరసింహారావు, హెచ్‌ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: బాలికలు ఉన్నత చదువులు చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి, సీడీపీఓ నీలోఫర్, హెచ్‌ఎం కర్నాటి తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీఓ వీరభద్రాచారి, ఎంఈఓ శర్వాణి, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. రావిపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఎస్సై బి.నరసింహారావు సలహాలిచ్చారు. వాసవీ విద్యానికేతన్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి సర్పంచ్ పల్నాటి బోడయ్య నివాళులర్పించి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు.

అర్ధవీడు: స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ బలరామునిరెడ్డి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి ఎంపీపీ కామూరి అమూల్య, జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో కరస్పాండెంట్ నారాయణరెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి నివాళులర్పించారు.

గిద్దలూరు రూరల్: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు విశ్రాంత హెచ్‌ఎం మార్కాపురం రాంభూపాల్‌రెడ్డి ప్రశంస పత్రాలు అందజేశారు. పీఎంసీ చైర్మన్ బాలునాయక్ పాల్గొన్నారు. గ్రంథాలయంలో వారోత్సవాలను రిటైర్డ్ ఎంఈఓ రామచంద్రారెడ్డి ప్రారంభించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి, గ్రంథపాలకులు ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాచర్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకే బాలోత్సవం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ షేక్ ఖాశింబి అన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఎంఈవో శివ కోటేశ్వరరావు, ఎస్సై కోటేశ్వరరావు, హెచ్‌ఎం రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాచర్లలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ ఖాశింబి



బేస్తవారిపేటలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



ఏ1 కాలేజీలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షంషేర్ ఆలీబేగ్



గిద్దలూరులో విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం రాంభూపాల్‌రెడ్డి

ఆధునిక దేవాలయాలు గ్రంథాలయాలు

- డీవైఈఓ శామ్యూల్ జాన్

మార్కాపురం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ప్రతి ఒక్కరూ పుస్తక జ్ఞానం సంపాదించుకోవాలని డీవైఈఓ శామ్యూల్ జాన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞానంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మంచి చెడు మధ్య వ్యత్యాసం తెలియాలంటే చదువొక్కటే మార్గమన్నారు. సీనియర్ పాత్రికేయుడు ఓఏ మల్లిక్ మాట్లాడుతూ.. తలిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపాలని సూచించారు. రిటైర్డ్ ఆర్జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాల ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తించాలని, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని చెప్పారు. గ్రంథపాలకుడు గాయం వెంకటశివారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, ఉపాధ్యాయులు ప్రియాంక, అంజలి తదితరులు పాల్గొని మాట్లాడారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

తర్లుపాడు: స్థానిక లైబ్రరీలో గ్రంథాలయ వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా తహసీల్దార్ విజయ భాస్కర్, ఎంపీడీఓ సుకుమార్, ఎంఈఓ 2 సుబ్బారావు, స్థానిక సర్పంచ్ వరాలు హాజరయ్యారు. నెహ్రూ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులతో లైబ్రేరియన్ సుబ్బారెడ్డి బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నెహ్రూ యూత్ అధ్యక్షుడు పుల్లయ్య, జెడ్పీ హెచ్‌ఎం సుధాకర్, నెహ్రూ యూత్ అధ్యక్షుడు పుల్లయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్షరం జీవితాన్ని మారుస్తుంది

రాచర్ల: స్థానిక గ్రంథాలయంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పాటలపోటీలు నిర్వహించారు. తొలుత జాతీయ పతకాన్ని ఆవిష్కరించి, నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. సర్పంచ్ సగినాల రాయలమ్మ, గ్రంథపాలకుడు కె.శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, సగినాల సాయిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ భర్త మృతి



షేక్ రసూల్(ఫైల్)

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువు గ్రామ సర్పంచ్ షాజహాన్ భర్త రసూల్(50) గురువారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. రసూల్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. రసూల్ భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మార్కాపురం, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి, కుందురు కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఇందిర హనుమారెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు నివాళులర్పించారు. సర్పంచ్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

కంభంలో భారీ వర్షం



కంభంలో కురుస్తున్న వర్షం

కంభం/కొనకనమిట్ల: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గురువారం ఉదయం కంభంలో భారీగా, సాయంత్రం ఓ మోస్తారుగా వర్షం కురిసింది. వర్షం శనగ పంటకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలు వీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు లేకపోవడంతో బురదమయంగా మారి ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. కొనకనమిట్ల మండలంలోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది. కంది, పత్తి, కూరగాయల పంటలతోపాటు గత నెలలో సాగు చేసిన అలసంద, మినుము, పొగాకు పంటలకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు పేర్కొంటున్నారు. వర్షానికి గొట్లగట్టు బస్టాండ్ సెంటర్ పంచాయతీ కార్యాలయం వద్ద రహదారిపై నీరు చేరింది.

జిగురు అట్టలతో మిరపలో తెల్లదోమ నివారణ

రాచర్ల: మిరప తోటల్లో పసుపు, బులుగు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేస్తే తామర పురుగు, తెల్లదోమను నివారించవచ్చని ఉద్యానశాఖాధికారి పి.విష్ణుప్రియ పేర్కొన్నారు. మండలంలోని చినగానిపల్లెలో మిరప పంట పొలాలను గురువారం పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. శిలీంద్రాల వల్ల వచ్చే ఆకుమచ్చ, కాయమచ్చలు తగ్గించే మార్గాలను తెలియజెప్పారు. మల్టీ కే, 19:19:19ను మొక్కలకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్ సిబ్బంది సాయిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

కంభం: కంభం, తురిమెళ్ల రైతు సేవా కేంద్రాల్లో గురువారం రబీ పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లావనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి శైలజ మాట్లాడుతూ.. పొగాకుకు ప్రత్యామ్నాయంగా అపరాల పంటలు సాగుచేసుకోవాలని సూచించారు. మిరప పంటలో చీడపీడల నివారణ, స్కీముల గురించి ఉద్యానవన శాఖాధికారి శ్వేత వివరించారు. కార్యక్రమంలో ఏఓ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.